navajyothidaily.com

# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | బుధవారం, 16 సెప్టెంబరు 2026 | ఎడిటర్ : మన్నె లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 324 | పేజీలు : 8 | వెల : 5/-



2లో..

హైదరాబాద్ రవాణా విస్తరణకు సమగ్ర ప్రణాళిక



3లో..

యూపీఐ ఛార్జీలపై.. రాహుల్ విమర్శలు



సైఫాబాద్ స్టేషన్‌లో..

## దాడి కలకలం

- పీఆర్‌వో, పీఏపై దాడి జరిగిందంటూ కేటీఆర్ ఆగ్రహం
- పోలీసుల సమక్షంలోనే గుండాలు దాడి చేశారని ఆరోపణ
- సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరపాలని డిమాండ్
- సీసీటీవీ ఫుటేజీ భద్రపరచాలని విజ్ఞప్తి

2లో..

బాలల భద్రతపై..

భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయనున్న మెటా

చిన్నారుల ఆన్‌లైన్ భద్రతకు ప్రాధాన్యం

సోషల్ మీడియా వేదికలపై కేంద్రం కఠిన నిఘా

# మెటా కీలక నిర్ణయం

## లైంగిక వేధింపుల కేసుల వివరాలు దర్యాప్తు సంస్థలకు అందిస్తాం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి):** బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసుల వివరాలను దర్యాప్తు సంస్థలకు అందించేందుకు సోషల్ మీడియా దిగ్గజం మెటా అంగీకరించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి సోషల్ మీడియా వేదిక చిన్నారుల ఆన్‌లైన్ భద్రతను నిర్ధారించడం తమ ప్రాథమిక బాధ్యతగా భావించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పిల్లల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని పేర్కొంటూ, చురుకైన చర్యలు తీసుకోని సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రభుత్వ వర్గాల ప్రకారం, బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను గుర్తించడం, వాటి వివరాలను దర్యాప్తు సంస్థలకు చేరవేయడం దిశగా మెటా తీసుకున్న నిర్ణయం కీలక ముందడుగుగా భావిస్తున్నారు. సోషల్ మీడియా వేదికలను చిన్నారులకు మరింత సురక్షితంగా మార్చేందుకు ఇది ప్రారంభ చర్య మాత్రమేనని, ఇంకా అనేక సంస్కరణలు అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. హానికరమైన కంటెంట్‌ను ముందుగానే గుర్తించి తొలగించే వ్యవస్థలను మరింత బలోపేతం చేయడానికి ఇతర సోషల్ మీడియా సంస్థలతో కూడా ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ అంశంపై స్పందించిన మెటా ప్రతినిధులు తమ వేదికల్లో పిల్లల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇకపై పిల్లల భద్రతకు సంబంధించిన అనుమానాస్పద అంశాలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (I4C) నిర్వహిస్తున్న జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌కు నేరుగా నివేదించనున్నట్లు వెల్లడించారు. ఇటీవల మెటా ఇండియాకు నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (NCPCR) నోటీసులు జారీ చేసిన విషయం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ప్రచురించిన కథనంలో సోషల్ మీడియా ప్రకటనల్లో బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన మెటీరియల్ ప్రస్తావన రావడంతో కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. మెటా నుంచి వివరణ కోరగా సంస్థ సమాధానం ఇచ్చినప్పటికీ, మరింత స్పష్టత అవసరమని భావించిన కమిషన్ విచారణను (మిగతా.. 2లో)



ఎర్రవల్లి కేసులో..

## హైకోర్టు కీలక ఆదేశాలు



- నిందితుల అరెస్టుపై తాత్కాలిక బ్రేక్
- నోటీసులతోనే దర్యాప్తు కొనసాగించాలని సూచన
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలపై ధర్మాసనం ప్రస్తావన
- పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం

3లో..



కిశౌ ప్రాజెక్టు ఒప్పందానికి

## ఆరు రాష్ట్రాల ఆమోదం

- అమిత్ షా సమక్షంలో కిశౌ ప్రాజెక్టు ఒప్పందంపై సంతకాలు
- జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- 97 వేల హెక్టార్లకు సాగునీరు, భారీ జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, (నవజ్యోతి ప్రతినిధి) దేశంలో జలవనరుల అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న కిశౌ ప్రాజెక్టు అమలుకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమక్షంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు అమలుకు మార్గం సుగమమైందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సంబంధిత రాష్ట్రాల మధ్య సమన్వయంతో ప్రాజెక్టు పనులను (మిగతా.. 2లో)

తెలంగాణ అభివృద్ధికి

## సహకరించండి : సీఎం

- ఆగా ఖాన్ ఫౌండేషన్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి
- విద్య, వైద్యం, పర్యాటక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చ
- మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును వివరించిన ముఖ్యమంత్రి
- గ్లోబల్ సమ్మిట్‌కు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు ఆహ్వానం

2లో..







అంగన్‌వాడీల బలోపేతానికి

## సమాజ భాగస్వామ్యం కావాలి

- 'మన అంగన్‌వాడీ.. మన బాధ్యత' నినాదంతో పోషణ మాసం నిర్వహణ
- పోషకాహారం, మాతృ సంరక్షణ, బాల్య వికాసంపై ప్రత్యేక దృష్టి
- అంగన్‌వాడీల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్న కేంద్ర మంత్రి

2లో..

# యూపీఐ వినియోగదారులకు ఊరట

- రూ.2 వేలపైబడిన వ్యాపార చెల్లింపులకే రుసుములు
- వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం లేదని ఎన్‌పీసీఐ స్పష్టీకరణ
- వ్యక్తిగత యూపీఐ లావాదేవీలు యథావిధిగా ఉచితం
- కొన్ని ప్రత్యేక సేవల చెల్లింపులపై ఫ్లాట్ రుసుము అమలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి) :** దేశవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ప్రకటన చేసింది. వ్యాపారులకు జరిగే కొన్ని రకాల చెల్లింపులపై పరిమిత రుసుములను ప్రవేశపెట్టినప్పటికీ, ఆ భారం నేరుగా వినియోగదారులపై పడదని స్పష్టం చేసింది. దీంతో యూపీఐ వినియోగదారుల్లో నెలకొన్న అనుమానాలకు తెరపడినట్లైంది. కోట్లాది మంది ప్రతిరోజూ ఉపయోగిస్తున్న డిజిటల్ చెల్లింపు వ్యవస్థపై కొత్త నిబంధనల ప్రభావం ఎలా ఉంటుందనే అంశంపై స్పష్టత లభించింది. ఎన్‌పీసీఐ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం, వ్యాపారులకు చేసే చెల్లింపుల్లో రూ.2 వేలకుపైబడిన లావాదేవీలపై 0.4 శాతం రుసుము వర్తించనుంది. అయితే ఈ రుసుమును వినియోగదారుల నుంచి వసూలు చేయకుండా సంబంధిత వ్యాపారులు లేదా సేవలందించే సంస్థలే భరించాల్సి ఉంటుంది. ఈ రుసుముకు గరిష్ఠ పరిమితిని రూ.300గా నిర్ణయించారు. దీంతో భారీ మొత్తాల లావాదేవీలు జరిగినప్పటికీ ఛార్జీల భారం అదుపులోనే ఉండనుంది. వినియోగదారులు తమ ఖాతాల నుంచి అదనంగా ఎలాంటి మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. మొత్తం పర్సన్ టు మర్చంట్ (పీ2ఎం) యూపీఐ లావాదేవీల్లో 95 శాతానికి పైగా రూ.2 వేలలోపే ఉంటాయని సంస్థ వెల్లడించింది. అందువల్ల చిన్న వ్యాపారులు, చిన్న మొత్తాల కొనుగోళ్లు చేసే వినియోగదారులపై ఈ కొత్త విధానం ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని పేర్కొంది. డిజిటల్ చెల్లింపులను మరింత విస్తృతంగా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపింది. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, డిజిటల్ వ్యాలెట్లతో పోలిస్తే యూపీఐపై అమలు చేస్తున్న రుసుములు చాలా తక్కువ స్థాయిలోనే ఉన్నాయని వివరించింది. ఇక రైల్వే సేవలు, టెలికాం సేవలు, బీమా ప్రీమియంలు, ఇంధన చెల్లింపులు వంటి కొన్ని ప్రత్యేక విభాగాల్లో రూ.2 వేలకుపైబడిన యూపీఐ లావాదేవీలపై ఫ్లాట్‌గా రూ.5 రుసుము వర్తించనుంది. అయితే ఈ మొత్తాన్ని కూడా కస్టమర్ల నుంచి వసూలు చేయకుండా సంబంధిత (మిగతా.. 3లో)



నెలాఖరులోపు వర్కింగ్ ప్రెసిడెంట్ల

## నియామకం

పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యమన్న పీసీసీ చీఫ్


కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చామన్న వ్యాఖ్య

కాంగ్రెస్ విజయానికి సమష్టి కృషి అవసరమని పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 15, (నవజ్యోతి ప్రతినిధి) తెలంగాణ కాంగ్రెస్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రెండేళ్లుగా పీసీసీ అధ్యక్షుడిగా తన ప్రయాణం ఎంతో ఉత్సాహంగా, సంతృప్తికరంగా సాగిందని పేర్కొన్నారు. పార్టీని బూత్ స్థాయి వరకు బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలకు భరోసా కల్పించగలిగామని అన్నారు. పార్టీ బలోపేతంలో అందరి సహకారం కీలక పాత్ర (మిగతా.. 3లో)



నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com



## తెలంగాణఅభివృద్ధికి
# సహకరించండి : సీఎం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15, (నవజ్యోతి ప్రతినిధి)**
తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ మరింత భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలోని విద్య, వైద్యం, పర్యాటక రంగాల అభివృద్ధిలో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి గుర్తు చేశారు. హైదరాబాద్ నగరంతో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావిస్తూ ఫౌండేషన్ సేవలను ప్రశంసించారు. తెలంగాణ వారసత్వ సంపద పరిరక్షణలో ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. శాసనమండలి భవనం, కుతుబ్ షాహీ సమాధుల పునరుద్ధరణలో ఫౌండేషన్ అందించిన సహకారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైదరాబాద్ నగర పునర్నిర్మాణంలో భాగంగా చేపడుతున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు గురించి ముఖ్యమంత్రి వివరించారు. మూసీ నది తీరాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తూ రాత్రి వేళ ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కళాశాల, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఫౌండేషన్ సహకారం అందించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రికి గోషామహల్‌లో కొత్త భవనం నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న భవనాన్ని వారసత్వ కట్టడంగా సంరక్షించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. చారిత్రక కట్టడాల పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ భాగస్వామ్యం రాష్ట్రానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ ప్రపంచ సదస్సుకు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సదస్సుకు వందకు పైగా దేశాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ఆసక్తి వ్యక్తం చేసిన ప్రిన్స్ రహీమ్‌కు, 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో పూర్తిగా కాలుష్య రహిత నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. సింగపూర్‌కు చెందిన సంస్థ ఫ్యూచర్ సిటీ ప్రధాన ప్రణాళికను రూపొందిస్తోందని, దాదాపు 15 వేల ఎకరాల్లో హరిత ప్రాంతాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2047 నాటికి దేశ స్థూల దేశీయోత్పత్తిలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, ఆగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ రవాణా విస్తరణకు
# సమగ్ర ప్రణాళిక

### నగర శివార్లలో ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు
### ట్రాఫిక్, కాలుష్య నియంత్రణకు కీలక చర్యలు
### మెట్రో, ఎంఎంటీఎస్, సిటీ బస్సులతో అనుసంధానం
### 2,200 ఎలక్ట్రిక్ బస్సులతో ప్రజా రవాణా బలోపేతం
### మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి)**
హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజా రవాణా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నగరానికి నలువైపులా ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసి రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రణాళికలో భాగంగా గాజులరామారం, శంషాబాద్, ఎల్బీనగర్, ఘట్కేసర్ ప్రాంతాల్లో ఆధునిక బస్ టెర్మినల్స్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు వైపు నుంచి వచ్చే దూరప్రాంత, అంతర్‌జిల్లా, అంతర్రాష్ట్ర బస్సులను నగర మధ్య ప్రాంతాల్లోకి అనుమతించకుండా ఆయా టెర్మినల్స్ వరకే పరిమితం చేసే విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. దీనివల్ల నగర రహదారులపై వాహనాల ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. టెర్మినల్స్ నుంచి ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకునేలా సిటీ ఆర్టీసీ బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటీఎస్ సేవలను సమన్వయం చేస్తూ లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయనున్నట్లు మంత్రి వివరించారు. ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంతో పాటు వ్యక్తిగత వాహనాల వినియోగం కూడా తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజా రవాణాపై మరింత విశ్వాసం పెరిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగరంలో ప్రైవేట్ బస్సుల అనియంత్రిత పార్కింగ్, రాత్రి వేళల్లో పెద్ద సంఖ్యలో నగరంలోకి ప్రవేశించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ప్రైవేట్ బస్సులను కూడా నిర్దేశిత టెర్మినల్స్ ద్వారానే నిర్వహించే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన నిబంధనల ప్రకారం యూజర్ ఛార్జీలతో టెర్మినల్స్ వినియోగించే విధానాన్ని రూపొందించనున్నట్లు వెల్లడించారు. బస్ టెర్మినల్స్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. గాజులరామారం ప్రాంతంలో సుమారు 100 ఎకరాలు, శంషాబాద్ ప్రాంతంలో సుమారు 150 ఎకరాల భూమిని టెర్మినల్ అవసరాలకు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని టెర్మినల్స్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని, ప్రయాణికులకు వేచి ఉండే ప్రదేశాలు, పార్కింగ్, మెరుగైన రవాణా అనుసంధానం వంటి అన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. హైదరాబాద్ ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసేందుకు రానున్న 2,200 ఎలక్ట్రిక్ బస్సులను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు మంత్రి తెలిపారు. టెర్మినల్స్ నుంచి నగరంలోని అన్ని ప్రాంతాలకు కొత్త రూట్లను రూపొందించి ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించనున్నట్లు చెప్పారు. టెర్మినల్ ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా నగర ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ, వాహన కాలుష్యాన్ని తగ్గించి హైదరాబాద్‌ను సుస్థిరమైన, ఆధునిక ప్రజా రవాణా నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## అంగన్‌వాడీల బలోపేతానికి..
# సమాజ భాగస్వామ్యం కావాలి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, (నవజ్యోతి ప్రతినిధి)**
దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పోషణ మాసం సందర్భంగా 'హమారీ అంగన్‌వాడీ.. హమారీ జిమ్మేదారీ' అనే నినాదంతో అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోషకాహారం, మాతృ సంరక్షణ, చిన్నారుల సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నందున వాటి బలోపేతానికి సమాజం మొత్తం బాధ్యత వహించాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం ప్రభుత్వ సేవా కేంద్రాలు మాత్రమే కాకుండా, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో తల్లులు, చిన్నారుల ఆరోగ్యాభివృద్ధికి ముఖ్యమైన వేదికలుగా నిలుస్తున్నాయని మంత్రి వివరించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య అవగాహన, ప్రారంభ బాల్య విద్య వంటి సేవలను అంగన్‌వాడీలు అందిస్తున్నాయని తెలిపారు. ఈ సేవలు మరింత సమర్థవంతంగా అందాలంటే స్థానిక సమాజం చురుకైన పాత్ర పోషించాల్సిన




అవసరం ఉందన్నారు. పోషణ మాసం కార్యక్రమాల ద్వారా తల్లులు, కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీలతో అనుసంధానం కావాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. పోషకాహార లోపం, రక్తహీనత, తల్లి-శిశు ఆరోగ్య సమస్యలను తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ప్రతి కుటుంబం పోషకాహార ప్రాముఖ్యతను గుర్తించి చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించింది. అంగన్‌వాడీలను మరింత సదుపాయాలతో అభివృద్ధి చేయడం, డిజిటల్ సేవలను విస్తరించడం, సిబ్బందికి శిక్షణ అందించడం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది. చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను క్రమం తప్పకుండా పర్యవేక్షించేందుకు ఆధునిక విధానాలను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. 'మా సంగ్ పోషణ్', 'మా కే సాథ్ పోషణ్ కే సంగ్' వంటి కార్యక్రమాల ద్వారా తల్లుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పిల్లల తొలి వెయ్యి రోజుల పోషణ, తల్లిపాల ప్రాముఖ్యత, సమతుల ఆహారం, పరిశుభ్రత వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. దీని ద్వారా ఆరోగ్యవంతమైన తరం నిర్మాణానికి దోహదపడాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అంగన్‌వాడీల అభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది సమాజం మొత్తం పంచుకోవాల్సిన బాధ్యత అని కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవి స్పష్టం చేశారు. ప్రతి అంగన్‌వాడీని దేశ భవిష్యత్తులో పెట్టుబడిగా భావించి ప్రజలు సహకరిస్తే పోషకాహార లోపాలను తగ్గించడంతో పాటు ఆరోగ్యవంతమైన, శక్తివంతమైన భారత నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

# సైఫాబాద్ స్టేషన్‌లో దాడి కలకలం

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి) :**
హైదరాబాద్‌లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్వో మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి జరిగిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన సుమారు 15 మంది వ్యక్తులు స్టేషన్‌లోకి ప్రవేశించి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా మారిందో ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోంమంత్రిగా కూడా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని, అణచివేతకు తలొగ్గని ప్రతి పౌరుడికి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలను ఎదుర్కోలేక అధికార పార్టీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తన సిబ్బందిని విచారణ పేరుతో ఉదయం స్టేషన్‌కు పిలిపించి రాత్రివరకు అక్కడే ఉంచారని కేటీఆర్ పేర్కొన్నారు. అనంతరం ముందుగానే రచించిన కుట్రలో భాగంగా ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీయాల్సిన అవసరం ఉందన్నారు. దాడికి పాల్పడిన వారు కాంగ్రెస్‌కు చెందిన గుండాలా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు ధరించి వచ్చారా? అనే అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిజాలు వెలుగులోకి రావాలంటే సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో స్వతంత్ర విచారణ చేపట్టాలని కోరారు. రాజకీయ ప్రభావాలకు అతీతంగా విచారణ జరిగితేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని అభిప్రాయపడ్డారు. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలను సంరక్షించి దర్యాప్తు సంస్థలకు అందించాలని కోరారు. అలాగే గాయపడిన మహేశ్ మాణిక్య, మహేందర్ రెడ్డిలకు తగిన రక్షణ కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనను నిరసిస్తూ కేటీఆర్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ట్యాగ్ చేస్తూ స్పందించారు. 'వెల్‌డన్



కాంగ్రెస్' అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతుండగా, బీఆర్ఎస్ నేతలు దీనిని ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణిస్తున్నారు.

## కిశౌ ప్రాజెక్టు ఒప్పందానికి..
# ఆరు రాష్ట్రాల ఆమోదం



(మొదటి పేజీ తరువాయి..)
వేగవంతం చేయనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం కిశౌ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయంలో సుమారు 90 శాతం భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు. మిగిలిన 10 శాతం వ్యయాన్ని 1994 ఒప్పందం ప్రకారం భాగస్వామ్య రాష్ట్రాలు భరించను న్నట్లు వివరించారు. జాతీయ ప్రయోజనా లను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తున్నామ ని పేర్కొన్నారు. కిశౌ ప్రాజెక్టు కింద ఉ త్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ప్రవహించే టాన్స్ నదిపై 232.6 మీటర్ల ఎత్తుతో భారీ కాంక్రీట్ గ్రావిటీ డ్యామ్ నిర్మించనున్నారు. ఈ డ్యామ్‌లో 1,562 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉండనుంది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత నీటి నిల్వ, పంపిణీ, వరద నియంత్రణ వ్యవస్థలు మరింత సమర్థవంతంగా మారనున్నాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 97 వేల హెక్టార్ల భూమికి సాగు నీరు అందించనున్నారు. ముఖ్యంగా వ్యవ సాయాధారిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగ డం వల్ల రైతులకు గణనీయమైన ప్రయోజ నం కలగనుంది. సాగునీటి వనరులు విస్తరించడం ద్వారా పంటల ఉత్పాదకత పెరగడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త ఊపు లభిస్తుందని నిపుణులు అభిప్రా యపడుతున్నారు. సాగునీటితో పాటు విద్యుత్ ఉత్పత్తిలో కూడా కిశౌ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా 1,476 మిలియన్ యూనిట్ల స్వచ్ఛమైన జలవిద్యుత్ ఉత్పత్తి చేయనున్న ట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పునరుత్పాదక ఇంధన వనరుల వినియో గాన్ని పెంచడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం వంటి లక్ష్యాలకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది. కిశౌ ప్రాజెక్టు అమలు ఉత్తర భారత రాష్ట్రాల నీటి, విద్యుత్ అవస రాల తీర్చడంలో కీలక మైలురాయిగా నిలు స్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రా ల మధ్య సమన్వయం, కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనాలు అందించడమే లక్ష్యమని అమిత్ షా స్పష్టం చేశారు. దేశ జలవనరుల అభివృద్ధి, వ్యవసాయ పురోగతి, స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి దిశగా ఇది ఒక చారిత్రాత్మక ముందడుగుగా నిలవనుందని ఆయన అన్నారు.

# బాలల భద్రతపై మెటా కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి..)
వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో మెటా ప్రతినిధులు కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. అదే సమయంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించిన కొన్ని ప్రకటనలపై ఆందోళన వ్యక్తం చేసింది. బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ వ్యాప్తి చెందుతోందన్న ఆరోపణలపై మెటాతో పాటు పలు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. పోక్సో చట్ట ఉల్లంఘనలకు దారితీసే అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. హానికరమైన ప్రకటనలను గుర్తించి తొలగించేందుకు చేపడుతున్న చర్యలపై వివరణ ఇవ్వాలని కూడా ఆదేశించింది. డీప్‌ఫేక్‌లు, బాలల లైంగిక వేధింపుల మెటీరియల్, నకిలీ ఖాతాలు వంటి సమస్యలపై ప్రభుత్వం ఇటీవల మరింత దృష్టి సారించింది. డిజిటల్ వేదికల జవాబుదారీతనాన్ని పెంచడంతో పాటు పిల్లలను ప్రభావితం చేసే చట్టవిరుద్ధ, హానికర కంటెంట్ వ్యాప్తిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటోంది. మెటా తీసుకున్న తాజా నిర్ణయం ఈ దిశగా ఒక కీలక మైలురాయిగా భావిస్తుండగా, భవిష్యత్తులో ఇతర సోషల్ మీడియా సంస్థలు కూడా ఇలాంటి చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



# యూపీఐ చార్జీలపై రాహుల్ విమర్శలు

- యూపీఐ లావాదేవీలపై కేంద్ర నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ ఆగ్రహం
- రూ.2 వేలకుపైబడిన వ్యాపార చెల్లింపులపై ఎండీఆర్‌కు అవకాశం ఉందని ఆరోపణ
- అమెరికా చెల్లింపు సంస్థల ఒత్తిడికి కేంద్రం తలొగ్గిందని వ్యాఖ్య
- జీరో-చార్జీ విధానాన్ని బలహీనపరిచే ప్రయత్నమని విమర్శ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి):** దేశవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్ రాజకీయ దుమారం రేపింది. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో చార్జీలు విధించే అవకాశానికి కేంద్రం మార్గం సుగమం చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం అమలులో ఉన్న జీరో-చార్జీ విధానాన్ని క్రమంగా బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నోటిఫికేషన్ ప్రకారం రూ.2 వేలకుపైబడిన వ్యాపార సంబంధిత యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించబడిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. యూపీఐ లావాదేవీల సంఖ్యలో పెద్ద మొత్తాల చెల్లింపులు తక్కువ శాతంలో ఉన్నప్పటికీ, మొత్తం లావాదేవీల విలువలో వాటి వాటా దాదాపు 65 శాతం వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ఈ మార్పు భవిష్యత్తులో వ్యాపారులు, వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశముందని హెచ్చరించారు. వినియోగదారుల నుంచి నేరుగా ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వ్యాపారులపై విధించే అదనపు చార్జీలు చివరికి వస్తువుల ధరల రూపంలో ప్రజలపైనే భారం మోపుతాయని రాహుల్ గాంధీ అన్నారు. దుకాణదారులు చెల్లించే ఎండీఆర్ మొత్తాన్ని తమ ఉత్పత్తులు, సేవల ధరల్లో కలిపే అవకాశం ఉంటుందని, దీంతో వినియోగదారుల జేబుల నుంచే ఆ డబ్బు బయటకు వెళ్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారాన్ని అంతర్జాతీయ చెల్లింపు సంస్థల ఒత్తిడితో ముడిపెట్టిన రాహుల్ గాంధీ, అమెరికాకు చెందిన చెల్లింపు సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి విదేశీ ఒత్తిడికి తలొగ్గారని ఆయన విమర్శించారు. యూపీఐ వ్యవస్థ దేశీయంగా విజయవంతమైన డిజిటల్ చెల్లింపుల నమూనాగా ఎదిగిన నేపథ్యంలో ఇలాంటి చర్యలు ఆ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం వినియోగదారులపై ఎలాంటి ప్రత్యక్ష భారం ఉండదని స్పష్టం చేస్తోంది. యూపీఐ సేవలను మరింత విస్తృతంగా అందుబాటులో ఉంచడం, చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగానే నిర్ణయాలు తీసుకుంటున్నామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అయితే తాజా నోటిఫికేషన్‌పై రాజకీయ పార్టీల మధ్య వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. యూపీఐ ప్రస్తుతం దేశంలో అత్యంత విస్తృతంగా వినియోగిస్తున్న డిజిటల్ చెల్లింపుల వేదికగా మారింది. చిన్న వ్యాపారుల నుంచి పెద్ద సంస్థల వరకు కోట్లాది లావాదేవీలు ప్రతిరోజూ ఈ వ్యవస్థ ద్వారా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యూపీఐపై భవిష్యత్తులో చార్జీలు విధించే అవకాశంపై వచ్చిన చర్చ దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఈ అంశంపై రాజకీయ పోరు మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నెలాఖరులోపు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం

(మొదటి పేజీ తరువాయి..)

పోషించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు మంచి సమన్వయం ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, అభిప్రాయ భేదాలు సహజమైనవేనని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో భిన్నాభిప్రాయాలు వచ్చినప్పటికీ వాటిని అదే రోజులో పరిష్కరించుకున్నామని చెప్పారు. పార్టీ వ్యవహారాల్లో సీఎం ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని, పార్టీ మరియు ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగామని వివరించారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడడమే తమ లక్ష్యమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. డీలిమిటేషన్ లేకుంటే తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో 17 స్థానాలను కాంగ్రెస్




గెలుచుకునేలా కృషి చేస్తామని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దేశవ్యాప్తంగా కుల సర్వే అమలు చేస్తామని వెల్లడించారు. తెలంగాణలో నిర్వహించిన కుల సర్వే ద్వారా నిజమైన సామాజిక న్యాయం సాధ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా కుల సర్వేను శాస్త్రీయంగా నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం కుల సర్వే అంశాన్ని నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. పార్టీ నిర్మాణంలో కొత్త విధానాలను అమలు చేశామని మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికలో పారదర్శక విధానాన్ని అనుసరించామని తెలిపారు. ఢిల్లీ నుంచి అబ్జర్వర్లను పంపించి సమీక్ష నిర్వహించిన తర్వాతే డీసీసీ అధ్యక్షులను ప్రకటించామని చెప్పారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులోనూ డీసీసీ అధ్యక్షుల అభిప్రాయానికి ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. సొసైటీ నియామకాల విషయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుల నిర్ణయానికే అధిక ప్రాధాన్యం ఇచ్చామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కార్యకర్తల అభిప్రాయాలు ప్రతిబింబించేలా నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో కూడా డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. క్రమశిక్షణ విషయంలో పార్టీ కఠినంగా వ్యవహరిస్తుందని, హద్దులు దాటిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకాలతో పార్టీ సంస్థాగత వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# డయల్ 112 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



### పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ.. సిబ్బందికి డీఎస్పీ నరేందర్‌గౌడ్ సూచనలు

మనోహరాబాద్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి నవీన్): మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌ను తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించి డయల్ 112 ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు త్వరిత సేవలు అందించాలని సూచించారు. వినాయక మండపాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలని – పాయింట్ బుక్స్ తనిఖీ చేయాలని – ఎంఓ నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. పెండింగ్ యూఐ కేసులను తగ్గించడం – పిటిషన్లను వెంటనే నమోదు చేయడం – ఆస్తి నేరాల ఛేదన – చోరీ సొత్తు రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ వెంకట్‌రాజాగౌడ్, ఎస్ఐ సుభాష్‌గౌడ్ – సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలి

### మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజారెడ్డికి బీజేపీ వన్‌టౌన్ నాయకుల వినతి

మిర్యాలగూడ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని 48 వార్డుల్లో గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతూ బీజేపీ మిర్యాలగూడ వన్‌టౌన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజారెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండపాల పరిసరాలను ప్రతిరోజూ శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని – వీధిలైట్లు, మురుగు కాలువలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. దోమల నివారణ మందు పిచికారీ చేయాలని – నిర్మానుష్య ప్రాంతాల్లో కంపచెట్లు, చెత్త తొలగించాలని – నీటి కొరత ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ అధ్యక్షుడు బంటుగిరి, ప్రధాన కార్యదర్శులు మూలరాజిరెడ్డి, కొంగరి వెంకటరమణ, దళిత మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి రమేష్, పట్టణ ఉపాధ్యక్షులు మోదుగుల అశోక్, ఓబీసీ అధ్యక్షుడు బొడ్డు సోములు, మహిళా మోర్చా అధ్యక్షురాలు గోనే కవితారెడ్డి, దళిత మోర్చా అధ్యక్షుడు కోడి ప్రవీణ్, దైద సొమ్ములు, బంటు రవి తదితరులు పాల్గొన్నారు.



# 66 గజాలు.. ఆరు అంతస్తులు!

### బేఖాతరైన సీఎంసీ ఆదేశాలు.. కేపీహెచ్‌బీలో అడ్డగోలు నిర్మాణం




కూకట్‌పల్లి, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి): కేపీహెచ్‌బీ రోడ్ నంబర్ 3లోని ఈడబ్ల్యూఎస్ 862 ప్లాట్‌లో కేవలం 66 గజాల స్థలంలో ఆరు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణాన్ని నిలిపివేయాలని సీఎంసీ ఉన్నతాధికారి ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని చెబుతున్నారు. ఇరుకు సందుల్లో నిర్మాణ సామగ్రిని రోడ్లపై వేయడంతో దుమ్ము – ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ – సీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### కుషాయిగూడ పారిశ్రామికవాడలో

# వెలగని వీధి దీపాలు

### చీకటిలో పారిశ్రామికవాడ.. వెంటనే వీధి దీపాలు వెలిగించాలని సీసీఎస్ విజ్ఞప్తి



కుషాయిగూడ, సెప్టెంబర్ 15, (నవజ్యోతి ప్రతినిధి) : కుషాయిగూడ పారిశ్రామికవాడలో పలు వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళల్లో చీకట్లు అలుముకుంటున్నాయని కాలనీ కమిటీల సమాఖ్య (సీసీఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. వీధి దీపాలు పనిచేయకపోవడంతో కార్మికులు, స్థానికులు రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. పారిశ్రామిక వాడలోని వీధి దీపాలను వెంటనే పరిశీలించి, మరమ్మతులు చేపట్టి అన్ని దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ పారిశ్రామిక కమిషనర్‌తో పాటు ఎంఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు కాలనీ కమిటీల సమాఖ్య ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, రాత్రివేళల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వీధి దీపాల నిర్వహణపై సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి జైలు

### ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా.. రెండు వారాల శిక్ష

కుషాయిగూడ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి) : మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం రెండు వారాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేల జరిమానా విధించింది. ఎన్ఎఫ్‌సీ వద్ద నీరజ్ శర్మ 244 ఎంజీ/100 మి.లీ. బీఏసీతో, హెచ్‌బీ కాలనీలో బుచ్చయ్య 347 ఎంజీ/100 మి.లీ. బీఏసీతో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా ఈ తీర్పు వెలువడింది.అనంతరం ఎస్‌హెచ్ఓ సీహెచ్. నరేందర్ రావు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు మద్యం సేవించిన అనంతరం వాహనం నడపకుండా రోడ్డు భద్రతకు సహకరించాలని సూచించారు.




# ఎర్రవల్లి కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి):**
ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదానికి సంబంధించిన కేసులో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయరాదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నిందితులకు నోటీసులు జారీ చేసి, చట్టపరమైన విధానాలకు అనుగుణంగా దర్యాప్తు కొనసాగించాలని పోలీసులను ఆదేశించింది. కేసు విచారణ సందర్భంగా పోలీసుల చర్యలపై కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. మంగళవారం జరిగిన విచారణలో కేసు స్వభావం, నమోదు చేసిన సెక్షన్లపై ధర్మాసనం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఏడేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను నేరుగా అరెస్టు చేయాల్సిన అవసరం ఏమిటని పోలీసులను ప్రశ్నించింది. ఇటువంటి సందర్భాల్లో అనుసరించాల్సిన విధానాలపై సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని గుర్తు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను పక్కనపెట్టి అరెస్టుల దిశగా ఎందుకు ముందుకు వెళ్తున్నారని ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించరాదని, చట్టబద్ధమైన ప్రక్రియను కచ్చితంగా పాటించాలని పోలీసు అధికారులను హెచ్చరించింది. విచారణ పేరుతో అనవసర తొందరపాటు చర్యలు చేపట్టకుండా చట్టం నిర్దేశించిన విధానాన్ని అనుసరించాలని సూచించింది. ఈ వివాదం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం ప్రారంభమైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర విమర్శలు, ఆరోపణలు కొనసాగుతున్నాయి. పసుపు నీళ్ల ఘటనపై కాంగ్రెస్ నాయకులు, స్థానికులు చేసిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే అరెస్టు చర్యలు చేపట్టనున్నారనే సమాచారం నేపథ్యంలో పలువురు నిందితులు హైకోర్టును ఆశ్రయించి ఉపశమనం కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు నిందితుల అరెస్టుపై తాత్కాలికంగా నిలుపుదల విధిస్తూ, తదుపరి చర్యలను చట్ట నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులకు స్పష్టం చేసింది. కేసు దర్యాప్తును కొనసాగించవచ్చని, అయితే నిందితుల హక్కులకు భంగం కలగకుండా వ్యవహరించాలని సూచించింది. ఈ ఆదేశాలతో ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# యూపీఐ వినియోగదారులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి..)

వ్యాపార సంస్థలు లేదా సేవా ప్రదాతలే భరించాల్సి ఉంటుందని ఎన్‌పీసీఐ వెల్లడించింది. దీంతో ఈ విభాగాల్లో సేవలు పొందే వినియోగదారులపై ప్రత్యక్ష ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేసింది. మరోవైపు వ్యక్తుల మధ్య జరిగే పర్సన్ టు పర్సన్ (పీ2పీ) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి మార్పులు ఉండవని ఎన్‌పీసీఐ ప్రకటించింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా ఇతర వ్యక్తులకు పంపే డబ్బుపై ఎలాంటి రుసుములు విధించబోమని తెలిపింది. లావాదేవీ మొత్తం ఎంత ఉన్నప్పటికీ పీ2పీ చెల్లింపులు యథావిధిగా పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇది సాధారణ వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో యూపీఐ దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన చెల్లింపు వేదికగా కొనసాగుతోంది. రోజుకు కోట్ల సంఖ్యలో లావాదేవీలు ఈ వేదిక ద్వారా జరుగుతున్నాయి. కొత్త నిబంధనలతో యూపీఐ సేవల నిర్వహణ మరింత సమర్థవంతంగా సాగుతుందని, అదే సమయంలో వినియోగదారుల ప్రయోజనాలు కూడా కాపాడబడతాయని ఎన్‌పీసీఐ అభిప్రాయపడుతోంది. దీంతో యూపీఐ వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంస్థ స్పష్టం చేసింది.

# 50 ఏళ్ల విమలక్క ప్రస్థానాన్ని విజయవంతం చేయాలి

### జగిత్యాలలో కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరపత్రం విడుదల



**జగిత్యాల జిల్లా బ్యూరో (నవజ్యోతి దినపత్రిక):** హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న '50 ఏళ్ల విమలక్క ప్రస్థానం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా కళాకారుల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. సోమవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రాన్ని నాయకులు విడుదల చేశారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో అరుణోదయ నాగన్న ప్రాంగణంలో 26 నుంచి 28 వరకు 50 గంటలపాటు ప్రజా కళాజాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాకారులు, సాహితీవేత్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మల్లిక్ తేజ, అభి, గద్దం రమేష్, రాజారాం మోహన్‌రెడ్డి, కంచి కిషన్, సతీష్‌కుమార్, క్రాంతి, నామని లక్ష్మక్క, తాటికొండ లతక్క తదితరులు పాల్గొన్నారు.

# హేర్ సెలూన్ల విద్యుత్ సబ్సిడీ బకాయిలు చెల్లించాలి

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి నాయి బ్రాహ్మణ సేవా సంఘం వినతి



మిర్యాలగూడ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): హేర్ సెలూన్లకు 250 యూనిట్ల వరకు విద్యుత్ సబ్సిడీ పథకంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మిర్యాలగూడ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అలగడప గిరిధర్, గౌరవ అధ్యక్షుడు వెలిజాల హనుమంతు, జంపాల సత్యనారాయణ, కృష్ణమూర్తి, గోలి యాదగిరి, పట్టణ అధ్యక్షుడు రాయించు నరసింహ, కార్యదర్శి మేడిపల్లి సైదులు, కోశాధికారి రాచమల్ల వెంకన్న, నాగబెల్లి యాదగిరి, జంపాల పాండు, ఇటికాల సత్యనారాయణ – సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యమ కళాకారులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి కపట ప్రేమ

### ఉద్యోగాలు కల్పించాలి.. ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక డిమాండ్



మిర్యాలగూడ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు పందిరి సైదులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా మూడేళ్లు దాటినా అమలు కాలేదని ఆరోపించారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగాల కల్పనపై తీర్మానం చేసి వెంటనే నియామకాలు చేపట్టాలని కోరారు. లేదంటే అనోజ్ వెంకన్న, దరువు అంజన్న, నకిరేకంటి కిరణ్‌కుమార్ నాయకత్వంలో అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలకొండ శ్రీనివాస్, అంకెపాక కోటేష్, కందుకూరి సుదర్శన్, దారం మల్లేష్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రెమడాల శ్రీనివాస్, నకిరేకంటి వేణు, మేదరి కిరణ్, ఆదిమల్ల యల్లయ్య, సిరిసనవాడ సత్యనారాయణ, కంచి శ్రీనివాస్, కందుల సైదులు, నర్సింగరావు, లింగయ్య, రాములు, లలిత తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సమస్యలపై మంత్రి సీతక్కకు వినతిపత్రం



కామారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి పట్టణంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం సమర్పించారు. పట్టణ పారిశుధ్యానికి మురికికాల్వల నిర్మాణం, అభివృద్ధికి సీసీ రోడ్లు, బీటీ రోడ్లకు రూ.10 కోట్ల చొప్పున నిధులు కేటాయించాలని కోరారు. సీసీ డ్రైన్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యాభివృద్ధికి ఇంజినీరింగ్, నర్సింగ్, పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కామారెడ్డి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి సహకరించాలని ఇప్ప ఉమారాణి విజ్ఞప్తి చేశారు.

## ఎర్రవల్లి ఘటనలో ఆరుగురు బీఆర్ఎస్ నేతల అరెస్ట్

### విజయవాడలో అదుపులోకి.. రిమాండ్ విధింపు



గజ్వేల్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లి ఘటనకు సంబంధించి పరారీలో ఉన్న ఆరుగురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు విజయవాడలో అరెస్ట్ చేసి గజ్వేల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించారు. అనంతరం వారిని సిద్దిపేట జైలుకు తరలించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి వెళ్లిన సమయంలో ఎర్రవల్లిలో దళితులను అవమానించారనే ఆరోపణలపై మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదైంది. కేసు అనంతరం నిందితులు పరారయ్యారు. వారిలో ఒకరు ఫోన్ ఆన్ చేయడంతో సాంకేతిక పరిజ్ఞానంతో విజయవాడలోని వారి స్థావరాన్ని గుర్తించిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో వరదరాజ్‌పూర్ మాజీ సర్పంచ్ కూడా ఉన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని గజ్వేల్ ఏసీపీ నర్సింలు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ వైఖరి మారాలి

### జ్యోతిబా పూలే విగ్రహానికి వినతి



కామారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): కులగణనలో బీసీ కాలమ్, ప్రతి కులానికి ప్రత్యేక సంకేత సంఖ్యతో శాస్త్రీయంగా లెక్కలు చేపట్టాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జ్యోతిబా పూలే విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. బీసీ కులగణనకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన సమయంలో బీజేపీ మద్దతు ఇవ్వకుండా సభను బహిష్కరించడం బీసీ వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. దేశంలో 60 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తూ అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ కింద 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం దారుణమన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తే రాబోయే రోజుల్లో క్షేత్రస్థాయిలో బీజేపీకి రాజకీయంగా తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంబాల లక్ష్మణ్ యాదవ్, కొత్తపల్లి మల్లన్న, ఒడ్డె ఎల్లన్న, విజయ్, నాగరాజు, హజీజ్, చాకలి రాజయ్య, వెంకటస్వామి, మహిళా అధ్యక్షురాలు బాజ లలిత, రమేష్, ప్రవీణ్, నవీన్, దయాకర్, రాజేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపూర్ అభివృద్ధికి వినతి



కామారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): బస్వాపూర్ గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను కామారెడ్డిలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజల అవసరాలు, అభివృద్ధి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించిన షబ్బీర్ అలీ, సురేష్ షెట్కార్ గ్రామ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్వాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నె మల్లేశం, మాజీ అధ్యక్షుడు చింతనూరి సిద్ధరాములు, యువజన కాంగ్రెస్ నాయకుడు తుడుం ప్రదీప్, కాంగ్రెస్ నాయకుడు మామిడి యాదగిరి పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

### పలు గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు





సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి):వినాయక చవితిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వినాయక మండపాల్లో నిర్వహించిన తొలి రోజు పూజా కార్యక్రమాల్లో ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రామ్‌నగర్‌లోని రామ్ మందిర్ వద్ద వేడుకలు ప్రారంభమయ్యాయి. జగ్గారెడ్డి భక్తులతో కలిసి భజనలు చేస్తూ బ్రాహ్మణవాడకు ఊరేగింపుగా వెళ్లి మట్టి గణపతి విగ్రహాన్ని తీసుకువచ్చారు. అనంతరం రామ్ మందిర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.గంజి మైదాన్‌లో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, అల్లుడు గుణ చైతన్యరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. రామ్ మందిర్ యువసేన సభ్యుడు దత్తు ఆధ్వర్యంలోని మండపంలోనూ కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు.టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ నేతృత్వంలోని చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద, కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాలను కుటుంబ సభ్యులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద భరత్ సాయిరెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో భరత్ సాయిరెడ్డి, ఆయన కాబోయే సతీమణి పాలక్ పటేల్ తొలి రోజు పూజల్లో పాల్గొన్నారు. నిర్మలా జగ్గారెడ్డి తదితర కుటుంబ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి తెలుగు ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

## గజ్వేల్ మార్కెట్‌లో సిబ్బందికి జీతాలు లేవు.. చెత్తకు కొదువ లేదు

### ఏడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలి: డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి





గజ్వేల్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి):

గజ్వేల్ సమీకృత మార్కెట్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం తీవ్ర ఆందోళనకరమని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. మంగళవారం కార్మి కులను కలిసి సమస్యలను తెలుసుకున్న ఆయన, జీతాలు చెల్లించాలని కోరుతూ కార్మికులు వారం రోజులుగా విధులు నిలిపివేయడంతో మార్కెట్‌లో చెత్త పేరుకుపోయి అపరిశుభ్రత, దుర్వాసన నెలకొందన్నారు.

కార్మికుల కుటుంబాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్ కమిటీ చైర్మన్, ఇన్‌చార్జి అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే స్పందించి పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాల చెల్లింపులో జాప్యం చేస్తే డీబీఎఫ్ ఆధ్వర్యంలో కార్మికుల తో కలిసి దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ మండల అధ్యక్షుడు సింగాటం చంద్రం, పారిశుద్ధ్య కార్మికులు యాదగిరి, లక్ష్మి, జయలక్ష్మి, సుగుణ, పోశమ్మ, కనుకమ్మ, భాగ్య, మం జుల, బాల్నర్సవ్వ, వసంత, వినోద్, రాజమల్లు, లక్ష్మిఎల్లవ్వ, నాగరాజు, బాస్కర్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

## భూకొనపల్లి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు



కామారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి పట్టణం 6వ వార్డులోని భూకొనపల్లి ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ శెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్‌రావు శంకుస్థాపన చేశారు. ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సందీప్, మండల అధ్యక్షులు రాజాగౌడ్, కృష్ణారావు, సొసైటీ చైర్మన్లు గూడెం శ్రీనివాస్, ఇంద్రకరణ్‌రెడ్డి, భీంరెడ్డి, సుధాకర్, స్థానిక కౌన్సిలర్ గంగాధర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, కౌన్సిలర్లు అంజాద్, మజీద్, వాజీద్, జావీద్, సత్యం, చిట్టీబాబు, మహేష్, లడ్డు, కో–ఆప్షన్ సభ్యుడు అలీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెడ్డినాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుట్నాల శ్రీను, మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, సీనియర్ నాయకులు పండ్ల రాజు, సర్పంచ్ రేఖ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, అశోక్‌రెడ్డి, గంప ప్రసాద్, తిరుమలస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, లక్ష్మి, సుతారి రమేష్, యాదవరెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కొడకండ్లలో వైభవంగా విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలు

### 85 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం.. భజనలతో ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



గజ్వేల్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో విఘ్నేశ్వరుడి నవరాత్రి ఉత్సవాలు 85 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా కొనసాగుతున్నాయి. సుమారు 85 ఏళ్ల క్రితం కర్క నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉత్సవాలను శ్రీ సీతారామచంద్ర భజన మండలి ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ భజన సంకీర్తనలు చేస్తున్నారు. డీజేలు, హంగామాకు దూరంగా సంప్రదాయ పద్ధతిలో ఉత్సవాలు నిర్వహిస్తూ కొడకండ్ల గ్రామం ఆదర్శంగా నిలుస్తోంది. నిమజ్జనం రోజున విఘ్నేశ్వరుడిని పల్లకిలో ఊరేగిస్తూ గ్రామంలోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లి భజనలు, సంకీర్తనలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. శ్రీ సీతారామచంద్ర భజన మండలి గతంలో భద్రాచలం దేవస్థానంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా ప్రదర్శన ఇవ్వగా, వెండి నటరాజ విగ్రహం బహుమతిగా అందుకోవడం విశేషం. 85 ఏళ్లుగా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న భజన మండలి సేవలను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

## చదువుకున్న బడికి తిరిగి వచ్చి.. జ్ఞాపకాల ఒడిలో షబ్బీర్ అలీ

- కామారెడ్డి బాయ్స్ స్కూల్ అభివృద్ధికి రూ.5 కోట్లు



కామారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి):తాను విద్యనభ్యసించిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కర్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. “నేను 1971లో చదువుకున్న బడి ఇది. నా జీవితానికి పునాది వేసిన ఈ పాఠశాల జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేను” అని భావోద్వేగంగా అన్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రస్తుత విద్యార్థులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.పాఠశాల అభివృద్ధి అవసరాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ప్రత్యేకంగా కృషి చేశానని తెలిపారు. పాత భవనాన్ని తొలగించి ఆధునిక ప్రమాణాలతో కొత్త భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ విద్యా సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక వసతులు కల్పించనున్నట్లు వివరించారు.“చదువు నేర్పిన బడికి మనం రుణపడి ఉంటాం. మనకు చేతనైనంత మంచి చేయడం ప్రతి పూర్వ విద్యార్థి బాధ్యత” అని షబ్బీర్ అలీ అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవజ్యోతి
తెలుగు దినపత్రిక
navajyothidaily.com

## మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జాతీయ ఇంజనీర్ల దినోత్సవం



కామారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): జాతీయ ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి, ఇంజనీరింగ్ రంగానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మాంతారావు, ఏఈ వేణు ప్రసాద్, టీపీఓ దేవరాజు, టీపీఎస్ కావ్య, టీపీబీఓ సాయి కిరణ్, మల్లికార్జున్, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యత్ సాంకేతికతపై పట్టు సాధించాలి

### బీవీఆర్ఐటీలో 3డీ ప్రింటింగ్‌పై ఐదు రోజుల శిక్షణ ప్రారంభం




నర్సాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్): భవిష్యత్ సాంకేతికతపై విద్యార్థులు పట్టు సాధించాలని బీవీఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే అన్నారు. నర్సాపూర్ బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో '3డీ ప్రింటింగ్, అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్'పై ఐదు రోజుల శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 15 నుంచి 19 వరకు ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ విభాగం, ఏఐసీటీఈ–ఐడియా ల్యాబ్, డిజైన్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా ఐఐటీ పాలక్కాడ్ డాక్టర్ కన్మణి సుబ్బు ఎస్. హాజరై 3డీ ప్రింటింగ్ వినియోగం, పరిశోధన, ఆవిష్కరణలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు 3డీ డిజైనింగ్, ప్రింటింగ్, నమూనా తయారీపై ప్రత్యక్ష శిక్షణ అందిస్తున్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డీన్ డాక్టర్ వి. మురళీకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ పి. విష్ణు, డాక్టర్ ఎం. సుధీర తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాన్ని సందర్శించిన కొల్లూర్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి



రామచంద్రపురం, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): రామచంద్రపురం మండలం తెల్లాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్ ఫేజ్–1లో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో కొల్లూర్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఏకదంత యూత్ ఆహ్వానం మేరకు మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు. భక్తులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నిరంజన్, పృథ్వీరాజ్, శ్రీనివాస్, నాగరాజ్, శివ, ప్రవీణ్, కృష్ణ, రణ్‌దీప్ సింగ్, సర్దార్ సింగ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: ఆదిత్యరెడ్డి



రామచంద్రపురం, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ఆదిత్యరెడ్డి ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డి, ఆదిత్యరెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్యతో కలిసి ఓల్డ్ రామచంద్రపురం, రామచంద్రరెడ్డినగర్, అశోక్‌నగర్‌లోని గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ కాలనీ, ఓల్డ్ ఎంఐజీ కాలనీ, ఎంపీసీ సొసైటీలో ఏర్పాటు చేసిన మండపాలను ఆదిత్యరెడ్డి సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## చిన్నారులను చోరీల బాట పట్టిస్తున్నదెవరు..?

### కేసీఆర్ నగర్‌లో చర్చ

రామచంద్రపురం, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): తెల్లాపూర్ డివిజన్ కేసీఆర్ నగర్ ఫేజ్–2లో గణేష్ మండపాల వద్ద చిన్నారులు చోరీలకు పాల్పడుతున్న ఘటనలు చర్చనీయాంశంగా మారాయి. 19వ బ్లాక్‌లోని వినాయక మండపంలో లడ్డూ చోరీకి పాల్పడిన కొందరు చిన్నారులు పట్టుబడినట్లు స్థానికులు తెలిపారు. వారు 29వ బ్లాక్‌కు చెందినవారిగా సమాచారం. చదువుకునే వయసులో చిన్నారులు చోరీల వైపు మళ్లడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి చిన్నారులకు కౌన్సెలింగ్ ఇచ్చి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

### అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తాం: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



జుక్కల్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బిచ్కుందలో నిర్వహించిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. జుక్కల్ నియోజకవర్గంలో అర్హులైన పేద కుటుంబాలకు సుమారు 16,564 నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర సరుకులతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందవచ్చన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన నిరుపేదలకు కొత్త కార్డుల పంపిణీ చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, మున్సిపల్ చైర్మన్ సీమ షెట్కర్, వైస్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ దున్నా శ్రీనివాస్



నడిగూడెం, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): గ్రామీణ పేదలకు స్థానికంగా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధి హామీ పనులు చేపడుతోందని, కూలీలు తమకు కేటాయించిన పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని చౌదరి చెరువు వద్ద చేపల కుంట నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ అంజిరెడ్డి మాట్లాడుతూ అధికారులు నిర్దేశించిన కొలతలు, నాణ్యతా ప్రమాణాల ప్రకారం పనులు పూర్తి చేసి కూలీలు పూర్తిస్థాయి వేతనం పొందాలని సూచించారు. పనిదినాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, వార్డు సభ్యులు ధర్నా లింగయ్య, నాగారపు సరస్వతి రాము, గుండు మహేందర్ ప్రసాద్, కాసాని మాధవి గోపీనాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, కూలీలు గుండు వెంకన్న, దున్న అర్జున్, పాలకి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో మాలల పక్షాన నిలిచిన ఎమ్మెల్సీ కోదండరాం

### ఎంసీఎఫ్ నాయకుల సన్మానం



నర్సాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్): మాలల రోస్టర్ అంశంపై శాసనమండలిలో చర్చించి వారి పక్షాన నిలిచిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను మాల కోఆర్డినేషన్ ఫోరమ్ (ఎంసీఎఫ్) నాయకులు ఘనంగా సన్మానించారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం అమల్లోకి వచ్చిన రోస్టర్ 22 వల్ల మాలలకు విద్య, ఉద్యోగాల్లో అన్యాయం జరుగుతోందని ఎంసీఎఫ్ నాయకులు గతంలో కోరగా, ఈ అంశాన్ని మండలిలో చర్చిస్తానని హామీ ఇచ్చిన కోదండరాం మాట నిలబెట్టుకున్నారని పి.పి. శంకర్, కల్లూరు సంజీవులు, ఊరట్ల శివ తెలిపారు. రోస్టర్‌ను సవరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా కోరినట్లు కోదండరాం తెలిపారు. కార్యక్రమంలో అహ్మద్‌నగర్ ఉపసర్పంచ్ యాదగిరి, కౌడిపల్లి మాజీ ఎంపీటీసీ రవి, తునికి మాజీ సర్పంచ్ సువర్ణముషయ్య, మదన్‌పల్లి మాజీ ఉపసర్పంచ్ ఆనంద్, మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులనే పూజిద్దాం

### పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపు



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. వినాయక చవితి సందర్భంగా అందరూ మట్టి విగ్రహాలనే పూజించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో జలాశయాలు కలుషితమవుతాయని, చెరువులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. వివేకానందనగర్ డివిజన్‌లోని చిత్తారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కొలనును పరిశీలించి, పాత నీటిని తొలగించి శుభ్రపరిచి తాజా నీటితో నింపాలని సిబ్బందికి సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పోలీసు భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. మండపాల నిర్వాహకులు భద్రతా జాగ్రత్తలు పాటిస్తూ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, స్థానిక నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత్‌రావు, మల్లయ్య, అల్లం మహేష్, చంద్రమోహన్ సాగర్ పాల్గొన్నారు.

**నవజ్యోతి ఎఫెక్ట్**

## స్కూల్ దారిలో ప్రమాదానికి చెక్!

### సమస్యను చూపించింది.. పరిష్కారాన్ని సాధించింది!




కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సూరారం మరాఠీ బస్తీలో కేవీఎం స్కూల్‌కు వెళ్లే మార్గంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభం సమస్యపై సెప్టెంబర్ 7న 'విరిగిన స్తంభం.. స్కూల్ దారిలో ముప్పు!' శీర్షికన నవజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. మినీ ట్రక్ ఢీకొనడంతో విరిగిపోయిన స్తంభం, వంగిపోయిన విద్యుత్ తీగలతో విద్యార్థులు, పాదచారులకు పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించిన అధికారులు ప్రమాదకర స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి పరిష్కారానికి కారణమైన నవజ్యోతి యాజమాన్యానికి, వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## నిమజ్జనానికి ముందే భద్రతా పర్యవేక్షణ!

### లింగం చెరువు కట్ట వద్ద ఏర్పాట్ల పరిశీలన



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): గణేష్ నిమజ్జనం నేపథ్యంలో సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగం చెరువు కట్ట మైసమ్మ వద్ద ఏర్పాట్లను కుత్బుల్లాపూర్ జోన్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, డివిజన్ ఏసీపీ బాలగంగిరెడ్డి పరిశీలించారు. నిమజ్జనానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రాకపోకలు, భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టి నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సూరారం సీఐ బాలరాజు, వివిధ సెక్టార్ల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి సొసైటీ ఆధ్వర్యంలో సేవలు అందిస్తాం: చైర్మన్ కయ్యుం నరసింహారెడ్డి



నిజాంసాగర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): రైతుల సంక్షేమానికి అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మెరుగైన సేవలు అందిస్తామని సొసైటీ చైర్మన్ కయ్యుం నరసింహారెడ్డి అన్నారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట రైతు వేదికలో ఆయన అధ్యక్షతన మహాగర్జన సభ నిర్వహించి సొసైటీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. 2026 మార్చి 1 నుంచి ఆగస్టు 31 వరకు సొసైటీ ఆదాయ, వ్యయ వివరాలను సీఈఓ సంగమేశ్వర్ గౌడ్ సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంకు లక్ష్మయ్య, మండల వ్యవసాయ అధికారి ఆచరిత, ఏఈఓ స్వర్ణలత, సొసైటీ వైస్ చైర్మన్ గుమస్తా శ్రీనివాస్, సభ్యులు శ్రీధర్, రామగౌడ్, రామకృష్ణ, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక ఖలీల్

### మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): కులమతాలకు అతీతంగా ప్రతి ఏటా వినాయక చవితి మండపాలకు లడ్డూ ప్రసాదం అందిస్తున్న ఎండీ ఖలీల్ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారని ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఎల్లమ్మబండ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన, ఏటా 21 కిలోల లడ్డూ సమర్పిస్తున్న ఖలీల్‌ను శాలువాతో సన్మానించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శశిధర్ పట్వారీ, చిన్నోళ్ల శ్రీనివాస్, సంపత్, కటిక రవి, దుర్గేశ్, భవాని, శ్రీకాంత్, యాకయ్య, కృష్ణ, పృథ్వీ, రాము, రవీందర్, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

### రూ.4.78 కోట్లతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ప్రారంభం



కామారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. కామారెడ్డి పట్టణంలో మహిళా ఉద్యోగుల కోసం రూ.4.78 కోట్లతో నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ (సఖి నివాస్ సెంటర్)ను మంగళవారం మంత్రి సీతక్క, జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కర్‌తో కలిసి షబ్బీర్ అలీ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు సురక్షిత వసతి కల్పించాలనే ఉద్దేశంతో హాస్టల్ నిర్మించినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి ఉద్యోగ, విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహిళా సంక్షేమంతో పాటు కామారెడ్డి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# జపాన్ విద్యా పర్యటనతో సరికొత్త స్ఫూర్తి

### తెలంగాణ పాఠశాలల్లో జపాన్ తరహా బోధన, క్రమశిక్షణకు కృషి: ప్రిన్సిపాల్ తల్లూరి సాయేశ్వరి



నడిగూడెం, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): జపాన్‌లో ఈ నెల 5 నుంచి 12 వరకు నిర్వహించిన విద్యా ఎక్స్‌పోజర్ టూర్‌లో పాల్గొనడం స్ఫూర్తిదాయకంగా ఉందని కరివిరాల తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్ – జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తల్లూరి సాయేశ్వరి తెలిపారు. జపాన్ విద్యా వ్యవస్థలోని వినూత్న బోధనా పద్ధతులు, ఉపాధ్యాయ శిక్షణ, సాంకేతికత వినియోగంతో పాటు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, పరిశుభ్రత, సమయపాలన, క్రీడలు, సామాజిక బాధ్యతకు ఇస్తున్న ప్రాధాన్యతను పరిశీలించినట్లు చెప్పారు. అక్కడి ఉత్తమ విధానాలను తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల అవసరాలకు అనుగుణంగా అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. విదేశీ విద్యా పర్యటనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, డైరెక్టర్ రమేష్, మోడల్ స్కూల్స్ అదనపు సంచాలకులు శ్రీనివాసచారి, సూర్యాపేట జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ కార్యకర్త మదనాచారి మృతి పార్టీకి తీరని లోటు: సర్పంచ్ గోసుల రాజేష్

### కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



నడిగూడెం, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త సంకోజు మదనాచారి మృతి పార్టీకి తీరని లోటని సర్పంచ్ గోసుల రాజేష్ అన్నారు. చెన్నకేశవపురం గ్రామంలోని మదనాచారి నివాసానికి వెళ్లిన రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ మృతుడి కుమారుడు సంకోజు గణేష్‌కు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కటికల పుల్లయ్య, వార్డు సభ్యులు పప్పుల ఉపేందర్, సంకోజు కరుణాచారి, కాంగ్రెస్ నాయకుడు సంతోజు జానయ్య, ఆర్ఎంపీ డాక్టర్ కొత్త ఉపేందర్, సంకోజు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రసాదం పంపిణీ

గజ్వేల్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం ప్రముఖ వ్యాపారవేత్త సముద్రాల అమర్‌నాథ్ రాధా దంపతుల ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, ప్రతి మంగళవారం దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరిపై స్వామివారి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల భద్రయ్య, అయ్యప్ప దేవస్థానం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ, నారాయణ కైలాస ప్రశాంత్, దొంతుల సత్యనారాయణ, శ్రీహరి, గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ విద్యా విధానం భేష్!

### చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతకు పెద్దపీట





కామారెడ్డి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): జపాన్ విద్యా విధానం విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి దోహదపడేలా ఉందని, చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, నైతిక విలువలు, సామాజిక బాధ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నారని కామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిన్నమల్లారెడ్డి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి. ప్రవీణ్‌కుమార్, కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయురాలు కె. ఇందిరా తెలిపారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు జపాన్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల విద్యా మార్పిడి కార్యక్రమంలో పాల్గొన్న వారు అక్కడి పాఠశాలలు, తరగతి గదులు, బోధనా విధానాలను పరిశీలించారు. విద్యార్థులను ఆలోచించేలా, ప్రశ్నించేలా, చర్చించేలా ప్రోత్సహించడం, ప్రాజెక్టులు, ప్రయోగాలు, అనుభవపూర్వక అభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రత్యేకంగా ఆకట్టుకుందని తెలిపారు. విద్యార్థులతోనే పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించడం ద్వారా బాధ్యత, క్రమశిక్షణ పెంపొందిస్తున్నారని, క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర విద్య, విపత్తులపై ముందస్తు శిక్షణ, బోధనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలు తమను ఆకట్టుకున్నాయని తెలిపారు. జపాన్‌లో నేర్చుకున్న మంచి బోధనా పద్ధతులను తెలంగాణ పాఠశాలల్లోనూ అన్వయించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# కెమికల్ వ్యర్థాలు?..నిఘా వ్యవస్థకు సవాల్!





కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15: (నవజ్యోతి ప్రతినిధి) :పారిశ్రామిక కాలుష్యాన్ని నియంత్రించేందుకు నిబంధనలు ఉన్నాయి.. పర్యవేక్షించేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఉంది. అయినా పారిశ్రామిక ప్రాంతాల్లో కెమికల్ వ్యర్థాలు? నాలాల్లోకి చేరుతున్నాయనే ఆరోపణలు రావడం అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు రేపుతోంది. దూలపల్లి పారిశ్రామిక వాడలోని ఎస్ఎస్‌కే బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద ఈ పరిస్థితి కనిపించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### పైపు ద్వారా వ్యర్థాల విడుదలపై ఆరోపణలు

వెనుక గేటు వైపు నుంచి పైపు ద్వారా కెమికల్ వ్యర్థాలు? నాలాలోకి వెళ్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టపగలే ఇలాంటి వ్యవహారం జరుగుతోందన్న ఆరోపణలు రావడంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక్కరోజు వ్యవహారమా? లేక తరచూ జరుగుతున్నదా? అన్నది అధికారుల తనిఖీల్లో తేలాల్సి ఉంది.

### పట్టపగలే ఇలా ఉంటే..రాత్రివేళ పరిస్థితి ఏమిటి?

ఫాక్స్ సాగర్ పరిసరాల్లో రాత్రివేళల్లో కూడా కెమికల్ వ్యర్థాలను పడవేస్తున్నారనే సమాచారం స్థానికుల నుంచి వినిపిస్తోంది. ఈ ఆరోపణలు వాస్తవమా? కాదా? అన్నది అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. నిజమైతే పర్యావరణ పరిరక్షణ వ్యవస్థకు ఇది తీవ్రమైన హెచ్చరికగా మారుతుంది.

### పీసీబీ తనిఖీలు..కేవలం కాగితాలకేనా?

పారిశ్రామిక యూనిట్లలో వ్యర్థాల నిర్వహణ, విడుదల విధానాలను తనిఖీ చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. మరి ఇలాంటి ఆరోపణలు బయటకు వచ్చినప్పుడు తనిఖీలు జరిగాయా? నమూనాలు సేకరించారా? నిబంధనల అమలును పరిశీలించారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిఘా ఉన్న చోటే ఉల్లంఘన జరిగితే.. ఆ నిఘా ప్రయోజనం ఏమిటన్నదే అసలు ప్రశ్న.

### కాలుష్యం ఎవరి బాధ్యత?

కెమికల్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాల్సిన బాధ్యత సంబంధిత పరిశ్రమలదే. మరోవైపు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అన్నది పర్యవేక్షించడం అధికారుల బాధ్యత. ఈ రెండు వ్యవస్థల్లో ఎక్కడైనా లోపం ఉంటే దాని ప్రభావం చివరకు ప్రజలపైనే పడుతుంది.

### తనిఖీతోనే తేలాలి

ప్రస్తుతం వస్తున్న ఆరోపణలపై ఊహాగానాలకు తావివ్వకుండా పీసీబీ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీ నిర్వహించాల్సిన అవసరం ఉంది. నాలా నుంచి నమూనాలు సేకరించడం, పైపుల వ్యవస్థను పరిశీలించడం, వ్యర్థాల నిర్వహణ రికార్డులను తనిఖీ చేయడం, అవసరమైతే ఫాక్స్ సాగర్ పరిసరాలను కూడా పరిశీలించడం ద్వారా వాస్తవాలను వెలుగులోకి తేవాలి.

# రోడ్లు, డ్రైనేజీ కోసం ప్రజల ఎదురుచూపులు

### అభివృద్ధికి నోచుకోని మనోహరాబాద్ కాలనీలు



మనోహరాబాద్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి నవీన్): మనోహరాబాద్ మండల కేంద్రంలోని పలు కాలనీలు మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఏళ్లు గడుస్తున్నా సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు, పారిశుధ్య సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, వర్షపు నీరు, మురుగు నిల్వలతో దోమలు, దుర్వాసన సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. కొత్త సర్పంచ్, పాలకవర్గం ఏర్పడి ఏడాది కావస్తున్నా కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా పాలకులు కాలనీల్లో పర్యటించి సమస్యలను గుర్తించి అవసరమైన అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించాలని, మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



# పర్యావరణ హితం.. పిండితో గణపతి విగ్రహం

### జర్నలిస్ట్ రాజపేట వెంకటేష్ కుమార్తె ఆరాధ్య వినూత్న ఆలోచనకు ప్రశంసలు



శివ్వంపేట, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్): పర్యావరణ పరిరక్షణపై అవగాహనతో శివ్వంపేటకు చెందిన చిన్నారి రాజపేట ఆరాధ్య గోధుమ పిండితో గణపతి విగ్రహాన్ని తయారు చేసి పూజించి అందరి ప్రశంసలు అందుకుంది. జర్నలిస్ట్ రాజపేట వెంకటేష్ కుమార్తె అయిన ఆరాధ్య ప్రస్తుతం నర్సాపూర్ (రావెల్లి) మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమవుతున్న నేపథ్యంలో పిండితో గణపతిని తయారు చేసినట్లు ఆరాధ్య తెలిపింది. పిండితో చేసిన విగ్రహం నీటిలో కరిగిపోయి జలచరాలకు ఆహారంగా మారుతుందని, కాలుష్యానికి కారణం కాదని వివరించింది. గతంలోనూ డ్రైఫ్రూట్స్‌తో పర్యావరణహిత రాఖీ తయారు చేసి తన సృజనాత్మకతను చాటుకున్న ఆరాధ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు అభినందించారు.

# ఆర్‌జీకేలో యూజీడీ కష్టాలు.. వారాల వినోద్ పాదయాత్ర

**యూజీడీ సమస్యపై ఎమ్మెల్యేకు నివేదిక.. పరిష్కారానికి కసరత్తు**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సాయిబాబానగర్ 292 డివిజన్‌లోని ఆర్‌జీకే కాలనీలో యూజీడీ సమస్యలపై సీనియర్ నాయకుడు వారాల వినోద్‌కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. 103వ బ్లాక్‌లో సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలపడంతో ఆయన ప్రాంతాన్ని పరిశీలించి, 1 నుంచి 14 బ్లాకుల వరకు పాదయాత్ర చేసి యూజీడీ లైన్ల పరిస్థితిని తెలుసుకున్నారు. సమస్యకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులతో చర్చించారు. సమస్యను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పీ. వివేకానంద దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారాల వినోద్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ ముదిరాజ్, తారా సింగ్, రాజు యాదవ్, రంగప్ప, బద్రి, జైసింహారెడ్డి, నరసింహగౌడ్, జహీర్, జగన్, కిరోసిన్ శీను, మహిళలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

# చైతన్య విద్యానికేతన్‌లో 15 ఏళ్లుగా మట్టి వినాయకుడికి పూజలు

**పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన**



భిక్కనూర్, సెప్టెంబర్ 14 (నవజ్యోతి ప్రతినిధి): భిక్కనూర్‌లోని చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌లో 15 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్నారు. సోషల్ ఉపాధ్యాయుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గణేష్ చతుర్థికి రెండు రోజుల ముందే పొలం గట్ల నుంచి మట్టి సేకరించి, నానబెట్టి స్వయంగా వినాయక విగ్రహాన్ని తయారు చేస్తున్నారు. అనంతరం 11 రోజుల పాటు ప్రతిరోజూ ఒక్కో తరగతి విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వినాయక చవితి ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో ప్రకృతి పరిరక్షణ బాధ్యతను పెంపొందించడమే లక్ష్యమని పాఠశాల కరస్పాండెంట్ భూర్ల రేణుకుమార్, హెడ్‌మాస్టర్ అశోక్‌యాదవ్ తెలిపారు.

## గులాబీ వర్ణ అలంకరణలో సిద్ధి గణపతి ప్రత్యేక దర్శనం



పటాన్చెరు, సెప్టెంబర్ 15(నవజ్యోతి ప్రతినిధి):శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండవ రోజు సిద్ధి గణపతికి గులాబీ వర్ణంలో విశేష అలంకరణ చేశారు.వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించిన సిద్ధి గణపతి భక్తులకు ప్రత్యేక దర్శనం ఇస్తున్నారు. స్వామివారి విశేష అలంకరణను దర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. ప్రత్యేక పూజలు, కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# సెప్టెంబర్ 17 నిర్వహణపై డిప్యూటీ తహసీల్దార్‌కు బీజేపీ వినతి

**విమోచన చరిత్ర పరిరక్షణకు సప్త సంకల్పాలు అమలు చేయాలని డిమాండ్**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించి, విమోచన చరిత్రను పరిరక్షించాలని కోరుతూ బీజేపీ దుండిగల్ సర్కిల్ నాయకులు గండిమైసమ్మ–దుండిగల్ మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక పరిణామం, ప్రజా పోరాటాలు, అమరవీరుల త్యాగాలను భావితరాలకు అందించాలని కోరారు. హైదరాబాద్‌లో సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహం, విమోచన మ్యూజియం ఏర్పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో స్మృతి కేంద్రాలు, పాఠ్యపుస్తకాల్లో విమోచన చరిత్రకు స్థానం, చారిత్రక ప్రాంతాల్లో స్మారకాలు, విమోచన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి వంటి "తెలంగాణ సప్త సంకల్పాలు" అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల స్థాయిలోనూ సెప్టెంబర్ 17న అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ దుండిగల్ సర్కిల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తురాయి భానుగౌడ్, ఉపాధ్యక్షులు ఎంబరి ఆంజనేయులు, వెంకటేష్ నాయక్, గోనె మల్లారెడ్డి, సర్గారి సత్తిరెడ్డి, ధమ్మగారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనధికార అంతస్తులపై కొరడా

**దొమ్మర పోచంపల్లిలో ఎస్+4 నిర్మాణం కూల్చివేత**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): దుండిగల్ సర్కిల్ పరిధిలోని దొమ్మర పోచంపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అనధికార నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ప్లాట్ నం.3/పార్ట్, సర్వే నం.253/పార్ట్‌లో ఎస్+2కు అనుమతి తీసుకుని అదనంగా ఎస్+4 వరకు నిర్మించినట్లు అధికారులు తెలిపారు. దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలను ఉపేక్షించబోమన్నారు. అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మించే వారిపై నిఘా కొనసాగుతుందని, అనధికార నిర్మాణాలపై కూల్చివేతలు కొనసాగుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# చర్లపల్లి–కుషాయిగూడ అభివృద్ధికి భారీ నిధులు

**పార్కుల అభివృద్ధికి రూ.281.50 లక్షలు మంజూరు**

చర్లపల్లి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): చర్లపల్లి, కుషాయిగూడ డివిజన్ల పరిధిలో పార్కులు, రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరైనట్లు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు. తన కృషితో ఆరు పార్కుల అభివృద్ధికి రూ.281.50 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. కుషాయిగూడ విస్టా హోమ్స్ పార్కుకు రూ.12.50 లక్షలు, చర్లపల్లి ఆఫీసర్స్ కాలనీ పార్కుకు రూ.98 లక్షలు, వీఆర్ కాలనీ–సాయిరెడ్డి కాలనీ, చిన్న చర్లపల్లి పార్కులకు రూ.42 లక్షలు, విద్యా మారుతి కాలనీలోని రెండు పార్కులకు రూ.49 లక్షలు, రామకృష్ణనగర్ పార్కుకు రూ.37 లక్షలు, వెంకట్‌రెడ్డినగర్ పార్కుకు రూ.43 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. బీఎన్‌రెడ్డినగర్‌లో రోడ్ల నిర్మాణానికి రూ.98 లక్షలు, మూడు శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.1.86 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ పరికరాలు, పిల్లల ఆటస్థలాలు, విద్యుత్ దీపాలు, ప్రహరీ వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధికి సహకరిస్తున్న టీపీసీసీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.



# ఎస్ఐఆర్ ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి: కలెక్టర్ ప్రతిమాసింగ్

రామాయంపేట, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2026 (ఎస్ఐఆర్)లో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్ల నోటీసులపై హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఝాన్సింగ్‌లింగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజనీకుమారితో కలిసి పరిశీలించారు. ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఓటర్ల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట 2002 నాటి ఓటరు జాబితాతో వివరాలను సరిపోల్చుకోవాలని తెలిపారు. నోటీసులు జారీ చేసిన ప్రతి ఓటరు హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.





# వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ ప్రతిమాసింగ్

**ఎఫ్ఎల్ఎన్ లక్ష్యసాధనలో ముందుండాలి.. మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలి**



రామాయంపేట, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్):పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసి ఎఫ్ఎల్ఎన్ లక్ష్యసాధనలో ముందుండాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం రామాయంపేట, అక్కన్నపేట మండలాల్లోని ప్రీ–ప్రైమరీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులతో కలిసి కూర్చొని బోధనా తీరును, అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి మెరుగైన స్థాయికి తీసుకురావాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో, పరిశుభ్రంగా పోషకాలతో కూడిన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# కోనాపూర్ పెద్ద చెరువుకు జలకళ

**అలుగు పారే స్థాయికి చేరిన చెరువు.. రైతుల్లో ఆనందం**



రామాయంపేట, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రామాయంపేట మండలం కోనాపూర్ పెద్ద చెరువు జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో చెరువు అలుగు పారే స్థాయికి చేరుకుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలో ఎల్‌నినో ప్రభావంపై నెలకొన్న ఆందోళన తొలగిపోయిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. చెరువు నిండుతుండటంతో సాగునీటికి భరోసా ఏర్పడిందని, ప్రస్తుత వర్షాలు పంటలకు అనుకూలంగా ఉండటంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మామిడి సిద్ధరాములు మాట్లాడుతూ కోనాపూర్ పెద్ద చెరువు అలుగు పడే స్థాయికి చేరుకోవడం శుభపరిణామమని, రైతులకు సాగునీటి సమస్యలు లేకుండా ప్రకృతి సహకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# అధిక వర్షాలతో తెగిన రోడ్డుకు తక్షణ మరమ్మతులు



రామాయంపేట, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాలకు సుతారిపల్లి గ్రామంలో కాలువ నిండిపోవడంతో రోడ్డు కొంతమేర తెగి వరదనీరు ఇళ్ల వైపు చేరింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ మద్దూరి సునీల్ వెంటనే స్పందించి జేసీబీతో కాలువలోని మట్టిని తొలగించి – రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యాదగిరి, వార్డు సభ్యులు రాగి అశోక్, శామార్తి మహేష్ – గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు ముప్పా రామారావు విరాళం

**డమ్మాయిగూడలో రెండు ప్రాంతాల ఉత్సవాలకు ఆర్థిక సహాయం**



డమ్మాయిగూడ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక చవితి సందర్భంగా డమ్మాయిగూడ 4వ డివిజన్ పరిధిలోని పాత గ్రామం 18వ వార్డు బలహీన వర్గాల కాలనీ గణేష్ ఉత్సవాలకు ముప్పా రామారావు రూ.15,116 – కాప్రా భవన రుషి హౌసింగ్ సొసైటీ పరిధిలోని పద్మశాలి టౌన్‌షిప్ బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు రూ.5,116 విరాళం అందించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు తన వంతు సహకారం అందించినట్లు రామారావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండాల యాదగిరి గౌడ్ – ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలి

- తెలంగాణ సప్తసంకల్పాలు అమలు చేయాలి..

**కాప్రా ఎంఆర్ఓకు బీజేపీ వినతి**




ఉప్పల్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని – తెలంగాణ సప్తసంకల్పాలను అమలు చేయాలని కోరుతూ బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్యదర్శి అంబటి వెంకటాచలం ఆధ్వర్యంలో కాప్రా, డాక్టర్ ఏఎస్ రావు నగర్, చర్లపల్లి డివిజన్ల నాయకులు ఎంఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో స్టాట్యూ ఆఫ్ లిబరేషన్–తెలంగాణ – విమోచన మ్యూజియం ఏర్పాటు, జిల్లా కేంద్రాల్లో స్మృతి కేంద్రాలు, పాఠ్యపుస్తకాల్లో విమోచన చరిత్ర, చారిత్రక గ్రామాల్లో స్మారక స్తూపాలు – విమోచన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ అధ్యక్షురాలు తుమ్మల సంధ్యారెడ్డి, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్ల ప్రభాకర్, కాప్రా డివిజన్ అధ్యక్షుడు శాంతికుమార్, దేవనాదం, రజనీకాంత్‌రెడ్డి, ఉమా శ్రీధర్, సందీప్ చారి, సోమేశ్ నాయుడు, తాళ్ల ఆనంద్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, వెంకులు, వంశరాజ్ రాజు, కె. విజయ్ ఆనంద్, విభాకరన్, గంగాధర్, నాగపురి నవీన్, వంశీ, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సూరారం చౌరస్తాలో గుర్తుతెలియని మృతదేహం

### గుర్తింపు కోసం పోలీసుల ప్రయత్నం..

### సమాచారం ఉంటే చెప్పాలని సీఐ బాలరాజు విజ్ఞప్తి

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూరారం చౌర స్తా సమీపంలో మంగళవారం ఉదయం 10:30 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు – వివరాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తించినా – వివరాలు తెలిసినా సూరారం పోలీస్‌స్టేషన్‌కు 87126 63299 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ బాలరాజు కోరారు.



# ఉప్పల్ శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి



ఉప్పల్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): ఉప్పల్ నియోజకవర్గంలోని శ్మశాన వాటికలు – సమాధి స్థలాలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ – కమ్యూనికేషన్స్, పరిశ్రమలు – వాణిజ్యం, శాసన వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటికల్లో ప్రహరీ గోడలు, సీసీ రోడ్లు, షెడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, లైటింగ్, ఆధునిక దహన వాటికలు – పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక గ్రాంట్ మంజూరు చేయాలని కోరారు.

# రైస్ మిల్లులో విజిలెన్స్ సోదాలు.. 6,026 బస్తాల ధాన్యం మాయం

### రూ.53.91 లక్షలు చెల్లించాలని ఆదేశం



శివ్వంపేట, సెప్టెంబర్ 16 (నవజ్యోతి ప్రతినిధి ఆకుల శ్రీనివాస్): గూడూరు శివారులోని ఓం సాయి వెంకటరమణ రైస్ మిల్లులో హైదరాబాద్ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ధాన్యం నిల్వలు – స్టాక్ రిజిస్టర్లు – రికార్డులను పరిశీలించగా 2022–23 రబీ సీజన్‌కు సంబంధించి 6,026 బస్తాల ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. తక్కువగా ఉన్న ధాన్యానికి గాను మిల్లు యజమాని ప్రభుత్వానికి రూ.53,91,606 చెల్లించాల్సి ఉంటుందని మెదక్ జిల్లా సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్ తాటి నర్సింలు తెలిపారు. తనిఖీల వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

# ప్రజా సమస్యలపై శంభీపూర్ క్రిష్ణకు వినతులు

### ఎమ్మెల్సీ – ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణను ప్రజలు – కాలనీ సభ్యులు – నాయకులు – అభిమానులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు – ఎమ్మెల్యే కె.పి. వివేకానంద దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని క్రిష్ణ తెలిపారు. వినాయక చవితి – ఇతర శుభకార్యాలకు హాజరుకావాలని పలువురు ఆహ్వానించారు. అనంతరం దుండిగల్ శివాజీ వ్యాయామశాల ముదిరాజ్ సంఘం యూత్ నూతన కమిటీ సభ్యులను క్రిష్ణ అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జక్కుల శ్రీనివాస్ యాదవ్, మాజీ ప్యాక్స్ డైరెక్టర్ ఈ. శ్రీనివాస్, అధ్యక్షుడు ఉప్పరి శివ భార్గవ్, వైస్ ప్రెసిడెంట్ కొరివి శ్రీకాంత్, జనరల్ సెక్రెటరీ తంబలి సతీష్, కోశాధికారి వేణు – కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

### మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు ఆత్మగౌరవం – స్వయం పాలన కల్పించిన ఘనత బీఆర్ఎస్ అధినేత – మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుదేనని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఈ నెల 17న అన్ని ఎస్టీ గ్రామ పంచాయతీలు – ప్రత్యేక తండా పంచాయతీల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. కేసీఆర్ హయాంలో మిర్యాలగూడ నియోజకవర్గంలో 58 నూతన గ్రామ పంచాయతీలు మంజూరు కాగా, 40 తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని చెప్పారు. గ్రామ పంచాయతీ భవనాలు, బీటీ రహదారులు, గిరిజన గురుకుల భవనాలు – సంత్ సేవాలాల్ భవనం తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. అనంతరం ధనావత్ చిట్టిబాబు నాయక్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎండి యూసుఫ్, ధనావత్ చిట్టిబాబు నాయక్, ఆంగోతు హాతిరామ్ నాయక్, చౌగాని భిక్షం గౌడ్, మట్టపల్లి సైదులు యాదవ్, దిరావత్ పాచు నాయక్, కుందూరు వీరకోటిరెడ్డి, ధనావత్ బాలాజీ నాయక్, కుర్రా



సేవియా నాయక్, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ధనావత్ ప్రకాష్ నాయక్ – పలువురు గిరిజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

మాడుగులపల్లి, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మాడుగులపల్లి మండల శాఖ అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ విమోచన దినోత్సవానికి చారిత్రక ప్రాధాన్యత ఉన్నందున ప్రభుత్వ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి – విమోచన చరిత్రను భావితరాలకు తెలియజేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మకంటి నరసింహ, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు చిలుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు గుడుగుంట్ల శ్రీనివాస్, మండల సోషల్ మీడియా కన్వీనర్ దారమల్ల నాగరాజు, బూత్ అధ్యక్షులు నల్లబోతు సైదులు, వెంకన్న, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో చెక్కుల పంపిణీ

మిర్యాలగూడ, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సహకారంతో మాడుగులపల్లి మండలం తోపుచర్ల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సుమారు రూ.2.08 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌని నిరంజన్ – మూడో వార్డు సభ్యుడు షేక్ ఖలీల్ పాషా పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి చొరవతో నిర్వహించిన కార్యక్రమంలో షేక్ సలాం, కేసాని పెద్ద వెంకన్న, కేసాని నవ్య, బంటు సతీష్‌కుమార్ చెక్కులు స్వీకరించారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థికంగా అండగా నిలుస్తుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి – గడ్డం వేణుగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# పెయింటింగ్ వేయడానికి వెళ్లి అనంతలోకాలకు..

### బిల్డింగ్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

తూప్రాన్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి నవీన్): తూప్రాన్‌లో బిల్డింగ్‌పై నుంచి పడి పెయింటర్ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డం శ్రీనివాస్ ఇంటికి పెయింటింగ్ వేసేందుకు వచ్చిన సంజయ్ (31) సోమవారం రాత్రి ఫోన్ మాట్లాడుతూ బిల్డింగ్‌పైకి వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం యజమాని పైకి వెళ్లి చూడగా పక్క భవనం ఆవరణలో సంజయ్ మృతిచెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.



# షెడ్ కడుతున్నారు.. నిబంధనలు పాటిస్తున్నారా?

### జీరో సెట్‌బ్యాక్‌తో భారీ నిర్మాణాలు.. ప్రమాదం జరిగాకే మేల్కొంటారా?



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఎస్వీ కోపరేటివ్‌లో నిర్మాణ నిబంధనలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సాయిరాం ప్లాస్టిక్ కంపెనీ ఫ్లాట్ నంబర్ 243 ఎదురుగా అనుమతులకు విరుద్ధంగా జీరో సెట్‌బ్యాక్‌తో రెండు భారీ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ దశలోనే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు – సెట్‌బ్యాక్ నిబంధనలు పరిశీలించాలని, ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# భక్తిశ్రద్ధలతో కాప్రా ప్రెస్ క్లబ్‌లో వినాయక చవితి వేడుకలు

### పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి



కాప్రా, సెప్టెంబర్ 15 (నవజ్యోతి ప్రతినిధి): కాప్రా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి – పుష్పాలు, పండ్లు, ఉండ్రాళ్లు సమర్పించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి – బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి పాల్గొని జర్నలిస్టుల ఐక్యత – సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. అనంతరం జర్నలిస్టులు – ప్రెస్ క్లబ్ సభ్యులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్ర మోహన్, సలహాదారులు బెలిదె అశోక్, ఎంపల్లి పద్మారెడ్డి, మాజీ అధ్యక్షులు శనిగరం అశోక్, పటేల్ నరసింహ, మాజీ కోశాధికారి యాటరాజు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు యావాపురం రవి, గోవిందుకుంట్ల ఆంజనేయులు, కోశాధికారి రామచంద్రమూర్తి, దొమ్మాటి కిరణ్‌కుమార్‌రావు, సంయుక్త కార్యదర్శి డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు తొడుపునూరు బాలకృష్ణ, సీనియర్ జర్నలిస్టులు పలుగుల పవన్, బస్వంత్‌రెడ్డి, సింగం రాజు, మమత తదితరులు పాల్గొన్నారు.